క్లుప్తంగా

నియామకం


ఉత్తర్వులు అందుకుంటున్న సాగర్

శంకరపట్నం: బీసీ సంక్షేమ విద్యార్థి సంఘం శంకరపట్నం మండల అధ్యక్షుడిగా తాడికల్ గ్రామానికి చెందిన దూస సాగర్‌ను నియమించినట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కని సంజయ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆదేశాల మేరకు శుక్రవారం నియామక ఉత్తర్వులు అందజేశామన్నారు. ఈసందర్భంగా సాగర్ మాట్లాడుతూ... నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఈకార్యక్రమంలో అభిలాష్, వెంకటేశ్, సాగర్, సంతోష్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సై తాండ్ర నరేశ్

గన్నేరువరం: హైదరాబాద్‌లో ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు జరిగే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో పోస్టర్‌ను మండలంలోని ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్సై తాండ్ర నరేశ్ పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తుమ్మ చందు, ఉపాధ్యక్షుడు ఇనుకొండ దత్తాద్రి, సంయుక్త కార్యదర్శి మఠం ప్రసాద్, మండల అధ్యక్షుడు రాపోలు సతీశ్, ఉపాధ్యక్షుడు ఇనుకొండ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి జీల వెంకటేశ్, సభ్యులు గంగాధర మహేందర్, మఠం రాజు, అనగల్ల అనిల్, చిప్ప హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత


ఎల్‌వోసీ అందజేస్తున్న వొడితెల ప్రణవ్

జమ్మికుంట: మండలంలోని వావిలాల గ్రామానికి చెందిన మేడిపల్లి శ్రీనివాస్, స్వప్న కూతురు సహస్ర మొదడు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. చికిత్సకు రూ.2.50 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలపడంతో కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్‌ను సంప్రదించారు. ప్రణవ్ సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చికిత్సకు రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. దీంతో చిన్నారి ఆపరేషన్ విజయవంతమైంది. ఈసందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, వొడితెల ప్రణవ్‌కు చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ఏవో ఫలితాల్లో 27వ ర్యాంకు


వినీతారెడ్డి

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన వంచ వినీతారెడ్డి వ్యవసాయాధికారి ఉద్యోగం సాధించింది. తండ్రి వంచ రాంగోపాల్‌రెడ్డి వ్యవసాయం చేస్తుండగా తల్లి భాగ్యరాణి అంగన్‌వాడీ టీచర్. వినీతారెడ్డి పదోతరగతి వరకు గ్రామంలో, ఇంటర్ కరీంనగర్‌లో చదివారు. బీఎస్సీ(అగ్రికల్చర్) వరంగల్, ఎమ్మెస్సీ(అగ్రికల్చర్) జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ కర్ణాటకలో పూర్తి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2023 మే 16న ఏవో పరీక్షలు నిర్వహించగా 2024 జూన్ 26న విడుదలైన ఫలితాల్లో వినీతారెడ్డి రాష్ట్ర స్థాయిలో 27వ, జోనల్ స్థాయిలో 15వ ర్యాంకు సాధించింది. ప్రభుత్వం నుంచి ఉద్యోగ నియామక ఉత్తర్వుల కోసం వేచి చూస్తుంది. గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

అవగాహన సదస్సు

ఇల్లందకుంట: ఇల్లందకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది శుక్రవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగ్యూ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ తులసిదాస్ విద్యార్థినులకు వివరించారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. హెచ్‌ఎం రమాదేవి, సునీత, ఏఎన్‌ఎం, ఆశాలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పరామర్శ

జమ్మికుంట: మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు మాచెర్ల నాగేశ్వర్ గౌడ్ తాటిచెట్టు పైనుంచి పడి మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని సర్వాయి పాపన్న మోకు దెబ్బ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు జక్కె వీరాస్వామిగౌడ్, జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి గణపతిరాజ్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు గండి రంజిత్‌గౌడ్ శుక్రవారం పరామర్శించారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన ఎక్స్‌గ్రేషియా అందించేందుకు కృషి చేస్తామని అన్నారు.


ఈదులగట్టెపల్లి వద్ద లోలెవెల్ కాజ్‌వే


లోలెవెల్ కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)

మానకొండూర్: వర్షాకాలంలో మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామంపై భాగాన ఉన్న ఊర చెరువు మత్తడి పొంగితే గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు ఉన్న లోలెవెల్ కాజ్‌వేపై నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో గ్రామం రెండుగా చీలి పోవడమే కాకుండా ఈదులగట్టెపల్లి మీదుగా అన్నారం వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతుంటారు.

• భారీ వర్షాలు కురిసిన సమయంలో గంగిపల్లిలోని ఇసుకవాగుపై భాగం నుంచి వచ్చే వరదతో ప్రమాదం పొంచి ఉంది. రోడ్డు పక్క నుంచి వచ్చే వరద ఉధృతికి రాకపోకలు నిలిచిపోతాయి. అంతే కాకుండా ఇళ్లలోకి వరదనీరు చేరుతుంది. వరదతో కొండపల్కల, ఎరడపల్లి, అర్కండ్ల, కరీంనగర్‌కు వెళ్లడానికి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. వరద ఉధృతి తగ్గే వరకూ ఎటూ వెళ్లలేక ఎక్కడికక్కడే ఉండిపోతారు.

ఏటా జలదిగ్బంధం

స్పందించని అధికారులు, పాలకులు

- వానాకాలంలో గ్రామాలకు పొంచి ఉన్న ముప్పు
- నాయకుల హామీలు గాలికి, వరదలు వస్తే రాకపోలకు బంద్

మండలంలోని పలు గ్రామాలు ఏటా వర్షాకాలంలో జలదిగ్బంధమవుతున్నాయి. లోలెవల్ కాజ్‌వేలపై నుంచి వరద ఉధృతంగా ప్రవహించినప్పుడు ఇతర గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. వరదలు ముంచెత్తినప్పుడు రాజకీయ నేతలు హైలెవల్ బ్రిడ్జీలు నిర్మిస్తామని హామీలు ఇవ్వడమే తప్పా వరద ముప్పు ఉన్న చోట ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని, వరదల కారణంగా భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చెరువు, కుంటలు నిండి మత్తడి పొంగినప్పుడు కాజ్‌వేలపై వరద ప్రవహిస్తుంది. ఆ సమయంలో వాహనదారులు, ప్రయాణికులు ఇతర మార్గాల ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఈదులగట్టెపల్లి, గంగిపల్లి ఇసుక వాగు, లింగాపూర్ గ్రామ పంచాయతీ సమీపంలోని కాజ్‌వే, లింగాపూర్-వెల్ది గ్రామాల మధ్య వెల్ది గ్రామ శివారులో, రంగపేట గ్రామ శివారులో, అన్నారం-లలితాపూర్, అన్నారం నాగుల చెరువు, జగ్గయ్యపల్లి గ్రామ శివారులోని లోలెవల్ కాజ్‌వేల వద్ద వరద ఉప్పొంగి ప్రవహిస్తే ఎక్కడివారు అక్కడే ఆగిపోతారు. లోలెవల్ కాజ్‌వేలతో ఏళ్లుగా ఇబ్బందులుపడుతున్నా అధికారులు, నాయకులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండి పడుతున్నారు. హైలెవల్ బ్రిడ్జీలు నిర్మించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్య పరిష్కరిస్తుందని ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి


గంగాధర: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రాము, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, తదితరులు

గంగాధర: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వి నియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాము, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారంపై అవగాహన సమావేశం నిర్వహించారు. రక్తహీనతకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఐరన్ లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవాలన్నారు. సీజన్‌లో లభించే పండ్లను తినాలని, సమస్యలుంటే హెల్ప్‌లైన్ నంబర్లు 181, 1098కి ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో డాక్టర్ సురేశ్, సూపర్‌వైజర్ ప్రశాంతి, ఏఎన్‌ఎం శ్రీలత, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, సావిత్రి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


శంకరపట్నం: మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీవాణి


శంకరపట్నం: సీజనల్ వ్యాధులు ప్రబల కుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శ్రీవాణి అన్నారు. మండలంలోని కొత్తగట్టు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. వర్షాకాలంలో నీటి నిల్వలు లేకుండా చూడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రత పాటించాలని మహిళలకు సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత, టీచర్ భారతి, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

కులధ్రువీకరణ పత్రాలు నిలిపివేయాలని వినతి


డీటీ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ కుల సంఘం నాయకులు

రామడుగు:మండలంలోని గోపాల్‌రావుపేట, లక్ష్మీపూర్, గుండి, వెలిచాల గ్రామాల్లో బేడ బుడిగ జంగాల పేరుతో కొందరు అక్రమంగా ఎస్సీ కులధృవీకరణ పత్రాలు పొందుతున్నారని, ధ్రువపత్రాల జారీని నిలిపివేయాలని కోరుతూ పలువురు ఎస్సీ కుల సంఘాల నాయకులు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... బీసీ కులానికి చెందినవారికి ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను అందజేసి తీరని అన్యాయం చేస్తున్నారని, అధికారులు తక్షణం ధృవీకరణ పత్రాలను ఇవ్వడం ఆపేయకుంటే ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు. ఇప్పటికి వరకు ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


చొప్పదండి: క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

చొప్పదండి: మండలంలోని మంగళపల్లిలో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. రు. లక్ష లోపు రుణాలను ఏక కాలంలో రుణమాఫీ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.
రామడుగు: మండలంలోని కిష్టాపూర్‌లో సీఎం, రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.
హుజూరాబాద్: యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కరీంనగర్ జిల్లాలో 37,745 రైతులు మంది రైతులు రుణమాఫీ లబ్ది పొందారని తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ పట్ల ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయన్నారు.
వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి, బేతిగల్ గ్రామాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

రేపటి నుంచి రామంచ దర్గా ఉత్సవాలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

చిగురుమామిడి: మండలంలోని రామంచలో షా అబ్దుల్ రెహమాన్ జంగేషాహిద్ దర్గా ఉర్సు సందల్ ఉత్సవాలకు ముస్తాబైంది. 21వ తేదీ నుంచి రెండు రోజుల పాటు ఘనంగా ఉత్సవాలు నిర్వహించనున్నామని దర్గా నిర్వాహకుడు మహ్మద్ కరీంఖాన్ తెలిపారు. జిల్లాలోనే రెండో అతిపెద్దది పేరున్న దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దాదాపు 300 ఏళ్ల క్రితం ఇస్లాం మత గురువు షా అబ్దుల్ రెహమాన్ రామంచతో పాటు ఇతర గ్రామాల్లో తిరుగుతూ ఇక్కడే చనిపోయాడని, అప్పటి రామంచ గ్రామ పోలీస్ పటేల్ నర్ర గోపాల్ రెడ్డి తనపొలం నుంచి వస్తుండగా ఒకచోట వెలుతురు కనిపించగా అదేచోట దర్గా నిర్మించారని పూర్వీకులు చెబుతుంటారు. గోపాల్ రెడ్డి కు టుంబీకులు వెంకట్‌రెడ్డి, మహ్మద్ కరీంఖాన్‌ల ఆధ్వర్యంలో ఏటా ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తుంటారని తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా దర్గా నిర్వాహకుడు కరీంఖాన్ గ్రామంలో పెద్ద ఎత్తున అన్నదానం చేస్తారు. అన్నదానం దాతలు, గ్రామస్తుల, సహాయ సహకారంతో నిర్వహిస్తారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఆరు గ్యారంటీలకు షరతులు పెట్టొద్దు


మాట్లాడుతున్న పొన్నగంటి కేదారి

గన్నేరువరం: ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొన్నగంటి కేదారి అన్నారు. గన్నేరువరంలో మండల కౌన్సిల్ సమావేశం శుక్రవారం పార్టీ మండల సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించారు. అర్హులకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, ఆసరా పెన్షన్లు, రుణమాఫీ, రూ.ఐదువందల బోనస్‌కు ఎలాంటి షరతులు పెట్టొద్దని డిమాండ్ చేశారు. అవినీతి అక్రమాలు, ప్రజాసమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటం చేస్తోందని, హామీలు అమలు చేయకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల క్యాదర్శి అంజిరెడ్డి, మహేందర్, శ్రీనివాస్, మొలుగూరి ఆంజనేయులు, సాగర్‌రెడ్డి, బోయిని మల్లయ్య, కూన మల్లయ్య, పంబాల ఆంజనేయులు, వెంకట్‌రెడ్డి, గోపయ్య, పిప్పల కనకయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జమ్మికుంట మున్సిపల్ కమిషనర్‌తో నేడు ఫోన్‌ఇన్


కమిషనర్ ఎండీ అయాజ్

జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం అధ్వానంగా ఉందా...ఓపెన్ ప్లాట్లు, ఖాళీ స్థలాలు చెత్తాచెదారంతో నిండుకుపోయాయా..డ్రెయినేజీలు, రోడ్లు సరిగా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా. అయితే మీ సమస్యలను నేరుగా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయండి. మున్సిపల్ కమిషనర్‌తో శనివారం'సాక్షి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది.

తేది. 20.07.24 శనివారం
సమయం: ఉదయం 10.30 నుంచి 11.00 గంటల వరకు

దయల్ చేయాల్సిన ఫోన్ నెంబర్ :
89787 78080


భిక్షాటన చేస్తున్న కేశవపట్నం గ్రామపంచాయతీ సిబ్బంది

జీపీ సిబ్బంది భిక్షాటన

శంకరపట్నం: వేతనాలు ఇవ్వడంలేదని మండలంలోని కేశవపట్నం గ్రామపంచాయతీ సిబ్బంది శుక్రవారం మండల కేంద్రంలో భిక్షాటన చేపట్టారు. ప్రభుత్వం రూ.150 కోట్లు విడుదల చేసినప్పటికీ అధికారులు వేతనాలను మంజూరు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఆరుమాసాలుగా జీతాలు రాకపోవడంతో పూటగడవడం కష్టంగా ఉందని ఆవేదన వెలిబుచ్చారు. కార్యక్రమంలో రాచర్ల మల్లేశం, ఎల్కపల్లి సారయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం


ప్రజలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక అన్నారు. పట్టణంలోని 1, 28వ వార్డుల్లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. వార్డు ప్రజలు శుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండాలని, మురుగుకాలువల్లో చెత్తాచెదారం వేయొద్దని, దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాల్లో వర్షం, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకో వాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, వార్డు అధికారులు రమ, రజిత, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషన్‌రావు, కుమారస్వామి, ఆరెల్లి రమేశ్, ఆశా వర్కర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,390



జమ్మికుంట: జమ్మికుంట పత్తిమార్కెట్‌లో శుక్రవారం క్వింటాల్ పత్తి రూ.7,390 పలికింది. మార్కెట్‌కు శని, ఆదివారం సెలవు ఉంటుందని, సోమవారం కొనుగోళ్లు యథావిధిగా జరుగుతాయని కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ తెలిపారు.

పొన్నం.. మీ సవాల్‌కు రెడీ


మాట్లాడుతున్న గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్‌టౌన్/హుజూరాబాద్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ చెప్పినట్లు రూ.2 లక్షల లోపు రుణం తీసుకున్న రైతుల్లో నూటికి 70శాతం మందికి లాభం కలగలేదని నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నామని, నిరూపిస్తే పొన్నం రాజీనామా చేస్తావా అంటూ బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సవాలు విసిరారు. శుక్రవారం సాయంత్రం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో మాట్లాడుతూ.. 'కరీంనగర్ జిల్లాలో ఏ మండలానికైనా వెళ్లి అక్కడి రైతులతో మాట్లాడదాం... 70 శాతానికి మించి రుణమాఫీ జరగలేదని తేలితే మీ మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా'? అంటూ ప్రశ్నించారు. రుణమాఫీపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు హుజూరాబాద్‌లో మాట్లాడుతూ.. రూ.34వేల కోట్ల రుణమాఫీ ఒకేసారి చేస్తానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాటమార్చి నిబంధనలను తెరపైకి తెచ్చారన్నారు. అప్పుల బాధ పోతుందని ఎదురుచూస్తున్న తెలంగాణ రైతులకు కాంగ్రెస్‌సర్కార్ నిరాశను మిగిల్చిందని అన్నారు. రీషెడ్యూల్ చేసుకున్న చాలామందికి రుణమాఫీ ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. బీజేపీ నేతలు బాస సత్యనారాయణ, గుగ్గిళ్లపు రమేశ్, తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కన్న కృష్ణ, కొలగాని శ్రీనివాస్, పెద్దపల్లి జితేందర్, రమణారెడ్డి, కాసర్ల ఆనంద్, అనూప్‌కుమార్, రాపర్తి విజయ పాల్గొన్నారు.

అనవసర లింకులు క్లిక్ చేయొద్దు



గన్నేరువరంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు, టీచర్లు

జమ్మికుంట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని,మొబైల్‌కు వచ్చే అనవసర లింకులు క్లిక్ చేయొద్దని టౌన్ సీఐ వరంగంటి రవి అన్నారు. మండలంలోని శాయంపేట గ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మైనర్ డ్రైవింగ్, డ్రగ్స్, గంజాయి, త్రిబుల్ రైడింగ్ ప్రమాదకరమని, యువత మత్తు పదార్థాలకు దురంగా ఉండాలని సూచించారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

గన్నేరువరం: విద్యార్థులు చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ భిక్షపతి, తిమ్మాపూర్ సర్కిల్ ఎక్సైజ్‌శాఖ ఎస్సైలు భారతి, శ్రీకాంత్ అన్నారు. గన్నేరువరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రామయ్య అధ్యక్షతన డ్రగ్స్, నాటుసారా, గంజాయి వంటి మాదకద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. చెడు అలవాట్లలకు బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు, యువత మత్తు పదార్థాల నిర్మూలనకు తమవంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ సిబ్బంది నరేష్, కొండల్, ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఫొటో స్టోరీ

వాటర్ ప్లాంట్ మూత.. తాగునీటికి తంటా



మానకొండూర్‌రూరల్: మండలంలోని పచ్చునూర్ జీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్ మరమ్మతుల కారణంగా నెలరోజులుగా మూతపడింది. ప్లాంట్ ద్వారా గ్రామ ప్రజలకు శుద్ధనీరు అందించేవారు. ప్లాంట్ మూత పడటంతో గ్రామస్తులు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేట్ ప్లాంట్‌ల వద్ద అధిక డబ్బులు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నామని వాపోతున్నారు. కొంత మంది నాలుగు కిలోమీటర్ల దూరంలోని లక్ష్మీపూర్‌కు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నారు. సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టి నప్పటినుంచి గ్రామ సమస్యలను పట్టించుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో వ్యాధుల బారినపడకుండా ఉండటానికి తక్షణం వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని అధికారులను కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



వీణవంక: మండలంలోని బేతిగల్ గ్రామ శివారులోని ఊర చెరువు మత్తడి వద్ద జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రోడ్డు మధ్యలోని కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. గుంతలు పడి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొందని ప్రయాణికులు భయాందోళనలో ఉన్నారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నూతన కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.